# రింగా రింగా రోజెస్

స్కూటర్ కిర్రుమంటూ ఆగింది. వాసంతి తూలి ముందుకు పడబోయి, శ్రీవారిని కసురుకుంది.

'ఏమిటా డ్రైవింగ్? పిల్లి ఎదురైందా?'

'నువ్వేచూడు' స్టీరింగ్ వదిలేసి, కళ్లజోడు తీస్తూ అన్నాడు కృష్ణమూర్తి.

వాసంతి చూసింది. అక్కడ ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ మాత్రమే ఉంటాడు మామూలుగా. కానీ ఇవాళ ఏకంగా ఓ పోలీసు వ్యానే ఉంది. వ్యాన్‌లో ఉండాల్సిన పోలీసులంతా రోడ్డుపైనే ఉన్నారు. అందులో సగం మంది విజిల్స్ వేస్తున్నారు. వాళ్లచుట్టూ 18 నుంచి 25 లోపు వయసుగల అమ్మాయిలు, అబ్బాయిలు ఒకరి చేతులొకరు పట్టుకుని గుండ్రంగా నించోడానికి ప్రయత్నిస్తున్నారు. పోలీసులు వాళ్లని నమ్రతగా కసురుతున్నారు.

'మిమ్మల్నేమీ అనడం లేదు మేడమ్. ఒక రౌండు కాకపోతే, పది రౌండ్లలో నిల్చోండి కానీ ఓ పద్ధతిగా నిల్చోండంతే...' జీన్స్ ధరించి, జేన్ ఆస్టిన్‌లా 19వ శతాబ్దపు ఇంగ్లీషు మాట్లాడుతున్న ఓ అమ్మాయిని బతిమలాడుతున్నాడు ఒక కానిస్టేబుల్. 'మళ్లీ అదేమాట' జేన్ ఆస్టిన్ విసుక్కుంది.



వద్దు మేడమ్ ప్లీజ్-ఇప్పటికే హైదరాబాద్ నుంచి సికింద్రాబాద్ దాకా వచ్చారు. నిలువుగా నించుంటే నాగార్జునసాగర్ దాకా వెళ్లిపోతారు" అని గట్టిగా అని మెల్లిగా ఏదో గొణుక్కున్నాడు కానిస్టేబుల్

ఏయ్ ఎవర్ని 'నీయవ్వ' అంటున్నావ్?

జేన్ ఆస్టిన్ మండిపడింది.

"నా అవ్వనే అన్నాను మేడమ్, మిమ్మల్ని కాదు" అంటూ, పరిస్థితి బాగోలేదని గ్రహించిన కానిస్టేబుల్, విజిల్ వేస్తూ మరోచోటికి వెళ్లబోయి కృష్ణమూర్తి దంపతుల్ని చూసి ఆగిపోయాడు.

'స్కూటర్‌ను వెనక్కి తిప్పండి సార్. ఇటుపోదు'.

'మా ఆఫీసులు ఇటే ఉన్నాయి. వెనక్కి వెళ్తే ఇల్లు వస్తుంది'

'అయితే ఇంటికే పొండిసార్' అన్నాడు. ఇంత సులభంగా సమస్యల్ని పరిష్కరించే కానిస్టేబుల్‌కి మంత్రిపదవి వస్తే ఎంత బాగుండనుకుంది వాసంతి. కృష్ణమూర్తికి మాత్రం ఒళ్ళు మండింది.

'ఇంతకు వాళ్లకేం వచ్చింది? ఎవరు వాళ్లసలు?'

కానిస్టేబుల్ నుదురు కొట్టుకున్నాడు. 'వాళ్లు విద్యార్థులు సార్, స్టూడెంట్సు. వాళ్లు ఎలా నించుంటే మేమలా నించోవాలని మాకు ఆర్డర్స్. వాళ్లు గుండ్రంగా నించున్నా, స్క్వేర్‌గా నించున్నా, రెక్టాంగ్యులర్‌గా నించున్నా ఏమీ అనకూడదు'. ఈ కానిస్టేబుల్‌కు లెక్కలు కూడా వచ్చినందుకు వాసంతికి మరీ ముచ్చటే

## మృణాళిని

సింది. కృష్ణమూర్తి చిరాగ్గా మొహం పెట్టుకుని స్కూటర్ బ్యాక్ చేయబోయాడు. ఇంతలో ఓ వైపు బ్యానర్ ఒకటి కనిపించి, విజిల్ వేసాడు.

'ఏం సార్ మీరు కూడా పోలీసుల్తో చేరిపోతున్నారా?' కానిస్టేబుల్ అడిగాడు.

'ఆహా... అదికాదు. వాళ్లు ఇలా ఎందుకు నించున్నారో తెలిసింది. ఆ పోస్టర్ చూడు. 'కాలుష్యం నశించాలి' ఈ దేశంలో గాలిలోనూ, నీటిలోనూ, తిండిలోనూ అన్నిట్లో కాలుష్యమేగా? అందుకేనన్నమాట మానవహారం మొదలెట్టారు. చూసావా వసూ, ఈ కాలం విద్యార్థులకు ఎంత సామాజిక స్పృహ ఉందో' ఉత్సాహం వచ్చేసింది మూర్తికి.

'ఇలా గుండ్రంగా నించుంటే కల్తీ పోద్దా?' కానిస్టేబుల్ గొణుక్కుంటూ, మరో స్కూటర్ వాలాను విజిల్‌తో పలకరించడానికి వెళ్లిపోయాడు.

'చూడు కావాలంటే' కృష్ణమూర్తి పుంజుకున్నాడు. 'ఆ పక్కన మున్సిపాల్టీ చెత్తకుండీ.

దాన్లో ఎంగిలాకులు చూసావా? ఎన్ని రోజులై ఉంటుందంటావ్ దాన్ని శుభ్రంచేసి? అటు చూడు పొగ... ఇటు చూడు డ్రైనేజీ నీళ్ళు. ఎంతకాలమైందో డ్రైనేజీ పాడయి. నీళ్లంతా రోడ్డు మీదే ఉన్నాయి. అందుకే చూడు ఇవన్నీ కవరయ్యేలాగా ఆ స్టూడెంట్స్ ఎంచక్కాగా నిం. చున్నారో. ప్రెస్‌ఫోటోగ్రాఫర్ల పంట పండింది వాళ...'

'ఇలా ఎంతసేపు నించుంటారండీ. కాళ్ళు నొప్పెట్టవూ?' వాసంతి సానుభూతిగా అడిగింది.

'బహుశా ఇందులో రిలే ఉంటుందేమో నిరాహార దీక్షల్లా' కృష్ణమూర్తి సాలోచనగా అన్నాడు.

'అవునుగాని... ఇక్కడెక్కడా ఫోన్లు లేవా

'ఏం? ఎందుకు? ఆఫీసుకు రానని చెప్తావా?

'అది కాదు. ఈ పిల్లలు ఇలా నించునే బదులు, మున్సిపల్ ఆఫీసుకు ఫోన్‌చేసి, చెత్త పట్టుకెళ్లమని చెప్పవచ్చుకదాని'. బిడియపడుతూనే అంది వాసంతి.

'మానవహారం గురించి అంత చులకనగా మాట్లాడవా కళ్ళుపోతాయి. మున్సిపల్ ఆఫీసులకు ఫోన్ చెయ్యడం నీలాంటి వాజమ్మలు కూడా చేయగలరు. ఒక ప్రయోజనం కోసం, ముక్కు మొహం తెలీనివారి చేతులు పట్టుకుని గంటలకొద్దీ నించోవడానికి ఎంత మనోనిబ్బరం ఉండాలి'. కృష్ణమూర్తి వాగ్ధాటికి అడ్డుపడింది. ఓ చుడీదార్ అమ్మాయి రాకతో.

'ఓ మైగాడ్! ఏం మిస్టర్! నీకు పెట్రోలు కుళాయిల్లో వస్తుందా? ఇందాకట్నుంచీ చూస్తున్నాను. ఇంజన్ ఆఫ్ చేస్తే ఒట్టు. పావుగంటనుంచి అలా వించుని మమ్మల్ని మిడుగు ద్లేషుకు చూస్తావా?' చూడీదార్ వెనక్కి చూసి 'ఆ నీలం బ్యానర్ ఇటివ్వండర్రా' అని కేకేసింది. వెంటనే 'పెట్రోలు దుర్వినియోగం మహాపాపం' అనే బ్యానర్ వచ్చేసింది. ఆ అమ్మాయి పోస్టర్ పట్టుకుని నించోగా, ఓ ఐదుగురు విద్యార్థులు కృష్ణమూర్తి స్కూటర్ చుట్టూ చేతులు పట్టుకుని నించున్నారు. 'మీరు ఇంజన్ ఆపేవరకూ మా హారం ఇలాగే ఉంటుంది'. భర్త మొహం చూడ్డానికి వాసంతికి భయమేసింది. ఎలాగో గొంతు పెకిలించుకుని

''మీ 'హారం' ఒకసారి పక్కకు జరిగితే, మేం వెళ్లిపోతాం'' అంది.

'ముందు ఇంజను ఆపండి' ఓ అబ్బాయి గద్దించాడు.

'ఇంజన్ ఆపితే ఎలా వెళ్తాం?' భయపడుతూనే అడిగింది వాసంతి.

'అయితే త్వరగా వెళ్లండి' ఓ అమ్మాయి అంది.

'మీరు అడ్డం జరగందే ఎలా వెళ్తాం?' అడిగింది వాసంతి.

'కాలుష్యం చెయిన్' కాస్తా 'పెట్రోల్ చెయిన్' అయిపోవడం అక్కడి విద్యార్థి నాయకులకు నచ్చలేదు.

'అందరూ తమతమ స్థానాల్లోకి రావాలని కోరుతున్నాం' అని ఓ కుర్రాడు అరిచాడు. పెట్రోలు హారం తెగిపోయింది. వాళ్లు వెళ్లి కాలుష్యహారంలో చేరిపోయారు.

తమ స్కూటర్ ఇంటి ముఖం పట్టగానే,

'ఎలాగూ ఆఫీసు పోయింది. సినిమా కెళ్దామా?' అని అడిగింది

స్కూటర్ థియేటర్ దారి పట్టింది. ఒక సందులో ఉన్న థియేటర్‌కు వెళ్దామని కృష్ణమూర్తి ప్రయత్నించాడు. సందు మొదట్లో పోలీసులు...

'సాబ్, సాబ్, రోకో...' కానిస్టేబుల్ వచ్చి చెయ్యి అడ్డం పెట్టాడు.




'గల్లీలోకి వెళ్లాలయ్యా. థియేటర్‌కు'

'వీల్లేదు సార్. అక్కడ మున్సిపల్ కార్పొరేటర్ గారు నిరాహార దీక్ష చేస్తున్నారు'

'చేస్తే చెయ్యమను. ఆయనకు అజీర్తిచేసి భోజనం మానేస్తే మేం సినిమా మానుకోవాలా?' కృష్ణమూర్తి అరిచాడు.

'నెమ్మది, సార్, నెమ్మది. ఆయన బలగమంతా చుట్టూ చేరారు. పైగా ప్రతిపక్షం వాళ్లు ఎదురుగా ఇంకో శిబిరం వేస్తున్నారు. డేంజర్ సార్...'

'ఇప్పుడీ శిబిరాలన్నీ ఎందుకు?' వాసంతి కుతూహలంగా అడిగింది.

'వాళ్ల వీధిలో లైట్లు వెలిగే వరకూ కార్పొరేటర్ నిరాహార దీక్ష ఆపడట. ఊళ్లలో ఇళ్లల్లోనే దీపాలు లేకపోతే నీకు వీధి దీపాలు కావాలా అని ప్రతిపక్షం వాళ్ళు నిరాహార దీక్ష చేస్తున్నార్ట'.

వాసంతి, కృష్ణమూర్తి ఇంటికి వచ్చేసరికి తలుపులు బార్లా తీసివున్నాయి. 'ఏదొంగో పడ్డాడో ఏంటో.. పద...' కృష్ణమూర్తి కంగారుగా అన్నాడు. ఇద్దరూ హడావిడిగా లోపలికి అడుగుపెట్టారు. పాప, బాబు, పక్కింటి పిల్లా, మేడపైని బాబు హాల్లో కూర్చుని ఉన్నారు.

'ఏమర్రా అప్పుడే వచ్చేసారు? స్కూలు లేదా?' వాసంతి అడిగింది.

'లేదమ్మా ఎవరో ఎవర్నో కొట్టారట. మా స్కూలు మూసేశారు. నేనే రిక్షా చేయించుకుని తమ్ముణ్ణి తీసుకువచ్చాను' పాప అంది. సర్లే అంటూ కాఫీ కలపడానికి లోపలికి వెళ్లింది వాసంతి. కాఫీలో చక్కెర సరిపోయిందో లేదోనని మూడవసారి స్పూన్‌తో నోట్లో పోసుకుంటుండగా కృష్ణమూర్తి రాకెట్‌లా దూసుకువచ్చాడు.

'వసూ, అక్కడ చూడు. కొంపమునిగింది'.

'ఏమైందండీ' అంటూ వాసంతి హాల్లోకి వచ్చేసరికి వారి ఇద్దరి పిల్లలు, పక్కింటి పిల్లలు, పైవాళ్ల పిల్లలు, వెరసి ఆరుగురు చేతులు కట్టుకుని, గుండ్రంగా నించున్నారు. 'ఓస్ అంతేకదా. రింగా రింగా రోజెస్' ఆడుకుంటున్నారండీ అని గొల్లున నవ్వింది వాసంతి.

'మేమేం రింగా రింగా రోజెస్ ఆడ్డం లేదు. ఫ్రిజ్‌లో పెట్టిన అమూల్ ఫ్రూట్ అండ్ నట్ ఇస్తావా? ఇలాగే గంటసేపు నించోమంటావా' పాప తీక్షణంగా చూస్తూ అడిగింది. ●

ఇంట్లో తయారు చేసినట్లు రుచి. తయారుచేసుకునే శ్రమే లేదు.